
సెల్‌ఫోన్‌లో ఫలితాలు చూసుకుంటున్న విద్యార్థులు

ప్లస్ టూలో 95.03 శాతం ఉత్తీర్ణత

పాఠ్యాంశాల వారీగా 100 మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు

తమిళం: 135, ఫిజిక్స్: 1,125, కెమిస్ట్రీ: 3,181, బయాలజీ - 827, మ్యాథ్స్: 3,022, బోటనీ :269, జువాలజీ :36, కంప్యూటర్ సైన్స్: 9,536, కామర్స్: 1.624, అకౌంటెన్సీ: 1,240, ఎకనామిక్స్: 556, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్: 4,208, జాగ్రఫీ: 273. ఏదైనా ఒక పాఠ్యాంశంలో 100 మార్కులు సాధించిన విద్యార్థులు : 26,887.

RAANI N T (5203233)					
Subject	Int	Theory	Pra	Total	Pass
TAMIL	N/A	089		089	P
ENGLISH	N/A	050		050	P
HISTORY	N/A	052		052	P
ECONOMICS	N/A	048		048	P
COMMERCE	N/A	067		067	P
ACCOUNTANCY	N/A	040		040	P
TOTAL				0346	PASS


రాణి

ఏడుపదుల వయసులో ప్లస్ టూ ఉత్తీర్ణత!

కోయంబత్తూర్‌కు చెందిన రాణి (70) అనే వృద్ధురాలు చదువుపై ఆసక్తితో ప్లస్ టూ పరీక్షలు రాసింది. గురువారం వెలువడిన ఫలితాల్లో రాణి 346 మార్కులు సాధించింది. తమిళంలో అధికంగా 89 మార్కులు, ఆంగ్లంలో 50 మార్కులు, చరిత్ర పాఠ్యాంశంలో 52 మార్కులు అంటూ మొత్తం 346 మార్కులు సాధించింది.

- వాషర్‌మెన్‌పేట, ఆంధ్రజ్యోతి

- ఈసారీ బాలికలదే పైచేయి
- జూన్ 25 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో 95.03 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ప్రాంగణంలో గురువారం ఉదయం పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. ఈ సారి కూడా విద్యార్థినులే అధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థినులు 96.70 శాతం, విద్యార్థులు 93.15 శాతం సాధించారు. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ పరీక్షలు మార్చి 8 నుంచి 25వ తేది వరకు జరిగాయి. 4,19,316 మంది విద్యార్థినులు, 3,73,178 మంది విద్యార్థులు కలిపి మొత్తం 7,92,494 మంది రాయగా, 7,53,142 (95.03 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్లస్ టూ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 91.94 శాతం, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు 95.71 శాతం, ప్రైవేటు పాఠశాలలు 98.88 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే, కో-ఎడ్యుకేషన్ పాఠశాలలు 95.30 శాతం, మహిళా పాఠశాలలు 96.50 శాతం, బాలుర పాఠశాలలు 90.14 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అరియలూరు జిల్లా 98.32 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, అనంతరం ఈరోడ్ జిల్లా 96.88 శాతం, తిరుప్పూర్ జిల్లా 95.64 శాతం, కన్నియకుమారి జిల్లా 95.06 శాతం, కడలూరు జిల్లా 94.99 శాతం ఉత్తీర్ణతో రెండు నుండి ఐదు స్థానాల్లో నిలిచాయి. కాగా, చెన్నై జిల్లా 94.44 శాతంతో 23వ స్థానం, 94.29 శాతంతో చెంగల్పట్టు జిల్లా 28వ స్థానం, 93.27 శాతంతో కాంచీపురం జిల్లా 32వ స్థానం, 91.49 శాతంతో తిరువళ్లూర్ జిల్లా 36వ స్థానంతో నిలిచాయి. కాగా వేలూరు జిల్లా 90.79 శాతం ఉత్తీర్ణత సాధించి చివరి స్థానంలో నిలిచింది.

టాపర్లు వీరే...

దిండుగల్ జిల్లా పళనికి చెందిన విద్యార్థిని ఒవియాంజలి ప్లస్ టూ పరీక్షల్లో 600 మార్కులకు 599 మార్కులు సాధించింది. అన్ని పాఠ్యాంశాల్లో 100 మార్కులు సాధించి ఆంగ్లంలో మాత్రం 99 మార్కులు తెచ్చుకుంది. ఒవియాంజలిని పాఠశాల అధ్యాపకులు అభినందించారు. అలాగే, పల్లడం భారత్ విద్యాలయం పాఠశాలకు చెందిన రాహుల్ కూడా 599 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచాడు. తిరుప్పూర్‌కు చెందిన సైన్స్ గ్రూప్‌లో చదివిన ఎస్.రుద్రమూర్తి 598 మార్కులు, చెన్నైకి చెందిన సైన్స్ గ్రూప్‌లో చదివిన ఆర్.లక్ష్మీకాంత్ 597 మార్కులు, రాణిపేటకు చెందిన జాస్మిన్ 597 మార్కులు, ధర్మపురికి చెందిన రక్షణ 597 మార్కులు సాధించి రాష్ట్రంలో టాపర్లుగా నిలిచారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన మహోన్నత పాఠశాలలు

వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల సంఖ్య ఈ ఏడాది పెరిగింది. 2024లో 2,478 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 2,638కు పెరగడం విశేషం. 2024లో 397 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది ఆ సంఖ్య 436కు చేరింది. ప్లస్ టూ పరీక్షలు రాసిన 8,019 మంది దివ్యాంగ విద్యార్థుల్లో 7,466 (93.10 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 140 మంది ఖైదీలు పరీక్షలు రాయగా 130 మంది (92.86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 16,904 మంది ప్రైవేటు అభ్యర్థులు పరీక్షలు రాయగా 5,500 (32.54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. పూందమల్లిలోని పాక్షిక అంధుల పాఠశాలలో 17 మంది విద్యార్థులు ప్లస్ టూ పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

జీసీసీ పాఠశాలల్లో 88.12 శాతం ఉత్తీర్ణత

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పాఠశాలల్లో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో 88.12 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న 35 మహోన్నత పాఠశాలలకు చెందిన 2,328 మంది విద్యార్థులు, 3,039 విద్యార్థినుల మొత్తం 5.387 మంది పరీక్షలు రాశారు. వారిలో 1,949 మంది విద్యార్థులు (83.70 శాతం, 2,798 మంది విద్యార్థినులు (91.46 శాతం) మొత్తం 4,747 మంది ఉత్తీర్ణులయ్యారు. నుంగంబాక్కం చెన్నై బాలికల మహోన్నత పాఠశాల 100 శాతంతో మొదటి స్థానంలో నిలువగా, పులియూర్ చెన్నై బాలికల మహోన్నత పాఠశాల 98.61 శాతం, సైదాపేట చెన్నై బాలికల మహోన్నత పాఠశా 97.36 శాతం రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. అలాగే, నెసపాక్కం చెన్నై మహోన్నత పాఠశాల 97.22 శాతం, తిరువాన్మియూర్ చెన్నై మహోన్నత పాఠశాల 95.59 శాతం ఉత్తీర్ణతతో నాలుగు, ఐదవ స్థానాల్లో నిలిచాయి.


ఒవియాంజలిని అభినందిస్తున్న పాఠశాల అధ్యాపకులు

మంత్రివర్గంలో స్వల్పమార్పులు

- దురైమురుగన్‌కు న్యాయశాఖ
- రఘుపతికి ఖనిజాలు


దురైమురుగన్, రఘుపతి

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో స్వల్పంగా మార్పులు జరిగాయి. రెండు వారాల క్రితమే ఇద్దరు మంత్రులకు ఉద్వాసన పలికి వారి నిర్వహించే శాఖలను ఇతర మంత్రులకు అదనంగా కేటాయించారు. అవినీతి కేసులో సుప్రీంకోర్టు బెయిలు కావాలో మంత్రి పదవి కావాలో తేల్చుకోమని చెప్పడంతో సెంథిల్‌బాలాజీ తన పదవి కోల్పోయారు. ఇదే విధంగా పెరియార్ ద్రావిడ కళగం సభలో మంత్రి పొన్ముడి అశ్లీల వ్యాఖ్యలు చేసి పదవిని కోల్పోయారు. సెంథిల్‌బాలాజీ నిర్వహించిన ఎక్సైజు శాఖను మంత్రి ముత్తుసామికి కేటాయించారు. పొన్ముడి నిర్వహించిన అటవీశాఖను మంత్రి రాజ కన్నప్పన్‌కు అదనంగా కేటాయించారు. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి సీనియర్ మంత్రి దురైమురుగన్ వద్ద జలవనరుల శాఖతోపాటు ఉన్న ఖనిజవనరులశాఖను మంత్రి రఘుపతికి, అతడి వద్ద వున్న న్యాయశాఖను మంత్రి దురైమురుగన్‌కు మార్చారు. ఆ మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన సిఫారసును ఆమోదిస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు.

తిరుచ్చిలో రూ.57.47 కోట్లతో ఆదర్శ పాఠశాల భవనాలు

- ప్రారంభించిన సీఎం స్టాలిన్



ఆదర్శ పాఠశాల భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తువాక్కుడిలో రూ.57.47 కోట్లతో నిర్మించిన ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూలు) భవనసముదాయం, హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ప్రారంభించారు. పాఠశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో తిరుచ్చి తువాక్కుడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో రూ.19.65 కోట్ల తో నిర్మించిన ఆదర్శ పాఠశాల భవనాలను, రూ.18.91 కోట్లతో అంతస్థులతో నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు.

తిరువళ్లువర్ విగ్రహావిష్కరణ...

అంతకు ముందు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ పాఠశాల ప్రాంగణంలో తిరువళ్లవర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎస్.రఘుపతి, ఎస్ఎస్ శివశంకర్, అన్బిల్ మహేష్, సీవీ మెయ్యనాథన్, ఎంపీ తిరుచ్చి శివా, ఎం.ఎ.అబ్దుల్లా, దురై వైగో, ఎమ్మెల్యేలు సౌందరపాండ్యన్, స్టాలిన్‌కుమార్, త్యాగరాజన్, పళనియాండి, ఇనికో ఇరుదయరాజ్, కదిరవన్, అబ్దుల్ సమదు, పాఠశాలల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి పి.చంద్రమోహన్, తిరుచ్చి జిల్లా కలెక్టర్ ఎం. ప్రదీప్‌కుమార్, రాష్ట్ర మోడల్ స్కూళ్ల మెంబర్ సెక్రటరి ఇరా సుదన్ తదితరులు పాల్గొన్నారు.


ఓ విద్యార్థినితో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

నా ప్రసంగం ప్రసారం చేస్తే డీఎంకే సర్కారు పతనమే

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి


సేలం అన్నాడీఎంకే కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, మే 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రజా సమస్యలు తదితర అంశాల గురించి ప్రతిపక్ష నేతగా తాను మాట్లాడడాన్ని పూర్తిగా టీవీలో ప్రచారం చేస్తే డీఎంకే ప్రభుత్వ పతనం ఖాయమేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. సేలం ఓమలూరులోని అన్నాడీఎంకే కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే అధికారంలోవున్నా.. లేకున్నప్పటికీ ప్రజల కోసమే పనిచేస్తుందని, అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు మరిచిపోలేదన్నారు. ఆచరణకు అమలుకాని హామీలతో ప్రజలను నమ్మించి డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, ఇలాంటి వాస్తవాలను ప్రసారం చేయాల్సిన బాధ్యత మీడియాదేనన్నారు. దేశరాజధాని ఢిల్లీకి వెళ్ళి కేంద్ర హోంశాఖ మంత్రిని తాను కలిసిన అనంతరం రాష్ట్రంలో పెండింగులో వున్న పథకాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మోడల్ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని, మరోవైపు హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ ఉద్యోగులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నా.. పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగబోయే ఎన్నికల కోసం బీజేపీతో అన్నాడీఎంకే పొత్తు కుదుర్చుకుందని, ఎన్నికలకు ఇంకా 9 నెలల సమయం ఉందని, ఆ లోగా మరికొన్ని పార్టీలు తమ కూటమిలో చేరుతాయని ఈపీఎస్ పేర్కొన్నారు.

అద్దాల వంతెన సురక్షితం

- 192 టన్నులు మోయగలిగే సామర్థ్యం
- రహదారుల శాఖ పరిశీలనలో వెల్లడి


అద్దాల వంతెనపై నీళ్ల క్యాన్లు ఉంచి పరిశీలిస్తున్న దృశ్యం

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో నిర్మించిన అద్దాల వంతెన ఒకే సమయంలో 192 టన్నుల బరువు తట్టుకోగలదని రెండో విడత పరిశీలనలో నిర్ధారణ అయింది. కన్నియాకుమారిలోని వివేకానంద రాక్-తిరువళ్లువర్ విగ్రహం అనుసంధానిస్తూ రూ.37 కోట్లతో ఫైబర్ గ్లాస్ వంతెనను రహదారుల శాఖ నిర్మించింది. ఈ వంతెనను ముఖ్యమంత్రి స్టాలిన్ గత ఏడాది డిసెంబరు 30వ తేది ప్రారంభించారు. బలమైన గాలులు, అలల ప్రకంపనాలు తట్టుకొనేలా ఈ వంతెనను బౌస్ట్రింగ్ ఆర్చ్ ఆకారంలో నిర్మించారు. ప్రయాణికుల భద్రత నిర్ధారించేలా వంతెన పటిష్టతపై శాస్త్రీయ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఆ ప్రకారం, రహదారుల శాఖ పలు సంస్థల సహకారంతో వంతెన పటిష్టతపై పరిశోధనలు చేపట్టింది. ఈ విషయమై రహదారుల శాఖ అధికారులు మాట్లాడుతూ... అన్నా విశ్వవిద్యాలయం ఆధీనంలోని తూత్తుకుడి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల ద్వారా కన్నియాకుమారి అద్దాల వంతెన పటిష్టతపై ఏప్రిల్ 15 నుంచి 18వ తేది వరకు పరిశోధనలు చేపట్టామన్నారు. అందుకోసం నీటితో నింపిన 200 కిలోల బరువున్న 964 'బారన్లు' వంతెనపై చేర్చి, 24 గంటలు పరిశీలించామని, దీని ద్వారా 192.8 టన్నుల వరకు అద్దాల వంతెన తట్టుకొనే సామర్థ్యం కలిగి ఉందని నిర్ధారణ అయిందన్నారు. అలాగే, మద్రాసు ఐఐటీ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన 'డైనమిక్ ప్రూఫ్' లోడ్ టెస్టింగ్ పద్ధతి ద్వారా వంతెన స్థిరత్వం నిర్ణయించామని తెలిపారు. ఇందుకోసం ఫైబర్ గ్లాస్ చివరన 'యాక్సిలరో మీటర్లు' అమర్చి పరిశీలించామని, తద్వారా ఈ వంతెన ప్రజల వినియోగానికి సురక్షితమైనదని ధృవీకరించినట్లు అధికారులు తెలిపారు.

చెన్నైలో రెండోరోజూ మాక్‌డ్రిల్

- యుద్ధసన్నద్ధతపై పౌరులకు అవగాహన
- మనలి, ఎన్నూర్‌లో విన్యాసాలు



ప్యారీస్, మే 8 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధవాతావరణ నెలకొన్న నేపథ్యంలో పౌరులను అప్రమత్తం చేసేలా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెండో రోజు గురువారం కూడా రాజధాని నగరం చెన్నైలో ఆపరేషన్ సిందూర్ పేరిట మాక్‌డ్రిల్ నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి మనలి, ఎన్నూర్ ప్రాంతాల్లో 'మాక్‌డ్రిల్' జరిగింది. కేంద్రప్రభుత్వ నిర్వహణలో మనలిలో వున్న చెన్నై పెట్రోకెమికల్ లిమిటెడ్ (సీపీసీఎల్) ఎన్నూర్‌లోని కామరాజర్ హార్బర్ వద్ద నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ మాక్‌డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్ బలగాలు, హోంగార్డులు, గ్రేటర్ చెన్నై పోలీసులు, అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ శాఖ, పలు అత్యవసర విభాగాల సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, వైద్య బృందాలు పాల్గొన్నాయి. యుద్ధ సమయంలో సైరన్ మోగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సహాయక బృందాలు క్షతగాత్రులను ఎలా కాపాడతారు, ప్రజలనుండి ఎలాంటి సహకారం ఉండాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో, యుద్ధసన్నద్ధ మాక్‌డ్రిల్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజల రక్షణ కోసమే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.





మదురైలో గురువారం ఉదయం ఘనంగా జరిగిన మీనాక్షి అమ్మవారి ఆలయంలో మీనాక్షి, సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం

7

సమాచార దృష్టి

'క్యూట్' పరీక్షా కేంద్రాల వివరాలు విడుదల

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'క్యూట్'ను జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ నెల 13 నుంచి జూన్ 3వ తేది వరకు ఈ పరీక్ష నిర్వహించనుంది. ఈ పరీక్షకు సంబంధించి పలు నగరాల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల వివరాలు https://nta.ac.in/ అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. జాబితాకు సంబంధించిన సందేహాలు 011-40759000 అనే నెంబరు, cuetug@nta.ac.in ఈ-మెయిల్ చిరునామాకు తెలియజేయాలి. పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులు హాల్ టిక్కెట్లకు https://nta.ac.in, https://cuet.nta.nic.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

రేపు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 19 ప్రాంతాల్లో రేషన్ దుకాణాల సేవలకు సంబంధించి ఈ నెల 10వ తేది గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు ఆహార వస్తువుల సరఫరా శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలోని ఆహార వస్తువుల సరఫరా, వినియోగదారుల భద్రతా శాఖకు చెందిన 19 మండల సహాయ కమిషనర్ కార్యాలయాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో రేషన్ కార్డుల్లో పేర్లు చేరిక, తొలగింపు, చిరునామా, సెల్‌ఫోన్ నెంబరు మార్పు తదితరాలకు వినతిపత్రాలు సమర్పించి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

14 నుంచి 'హోమ్ కేర్ ప్రొడక్ట్స్' తయారీపై శిక్షణ

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'హోమ్ కేర్ ప్రొడక్ట్స్ అండ్ ఇండస్ట్రీస్ కెమికల్ ప్రొడక్ట్స్' తయారీపై ఈనెల 14 నుంచి 16వ తేది (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు) వరకు శిక్షణ ఇవ్వనున్నారు. బ్లాక్ ఫినాయిల్, కట్టింగ్ ఆయిల్, గ్రీజ్, ఇండస్ట్రియల్ సోప్ ఆయిల్, ఫైప్ క్లీనింగ్ పౌడర్, వాటర్ ట్యాంక్ క్లీనింగ్ లిక్విడ్, డిష్ వాష్ సోప్, డిటర్జెంట్ సోప్, డెటాల్, ఎస్ఎస్-మెటల్ క్లీనింగ్ లిక్విడ్, కార్ పాలిష్, హ్యాండ్ వాష్ లిక్విడ్ సహా పలు వస్తువుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. 18 ఏళ్లు నిండి పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 8668102600 అనే నెంబరు సంప్రదించవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వండలూరు జూ పార్క్‌లో విద్యార్థులకు శిక్షణ

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో విద్యార్థులు వేసవి శిక్షణ జరుగనుంది. ఈ శిక్షణ ఈ నెల 14-15, 21-22, 28-29, 30-31, జూన్ 4-5 తేదీల్లో ఐదు విభాగాలుగా రెండు రోజులు శిక్షణ నిర్వహించనున్నారు. ఒక్కో విభాగంలో 50 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన విద్యార్థులు రెండు రోజులు పార్క్‌లోని క్షీరదాలు, జంతువులు, ఇతర జీవులతో ప్రత్యక్ష అనుభవాన్ని పొందవచ్చు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు 'పార్క్ రేంజర్' అనే సర్టిఫికెట్, బాడ్జి అందజేస్తారు. అలాగే, పార్క్‌ను 10 సార్లు ఉచితంగా సందర్శించేందుకు టోకెన్లు ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన 5, ఆ పై తరగతి విద్యార్థులు www.aazp.in/summercamp2025/ అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవచ్చు. ముందుగా నమోదుచేసుకున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

15 నుంచి ఊటీలో పుష్ప ప్రదర్శన ప్రారంభం

ప్యారీస్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి విడిది కేంద్రంగా పర్యాటకులను ఆకట్టుకుంటున్న ఊటీలో 127వ పుష్పప్రదర్శన ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య ప్రకటించారు. ఈ జిల్లాలో ప్రతిఏటా ఏప్రిల్ నుండి మే వరకు ఉద్యానవన శాఖ నిర్వహణలోని ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్, రోజ్ గార్డెన్, తేయాకు గార్డెన్, కున్నూరులో సిమ్స్ పార్కు, కాటేరి పార్కు, కోథగిరిలో నెహ్రూ పార్కులను అందంగా తయారు చేసి, సందర్శనకు పర్యాటకులను అనుమతిస్తారు. గూడలూరులో ఈ నెల 9,10,11 తేదీల్లో సుగంధ ద్రవ్యాల ప్రదర్శన, ఊటీలో 10,11,12 తేదీల్లో గులాబీల ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఊటీ బొటానికల్ గార్డెన్‌లో 127వ పుష్పప్రదర్శన ఈ నెల 15 ననుంచి 25వ తేదీ వరకు జరుగుతుందని కలెక్టర్ ప్రకటించారు.

12న ఏకకాలంలో సూర్యాస్తమయం, చంద్రోదయం

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమి రోజైన ఈనెల 12వ తేది కన్నియాకుమారిలో సాయంత్రం సూర్యాస్తమయం, అదే సమయంలో చంద్రోదయం వీక్షించవచ్చు. ఈ రెండు సంఘటనలు ఒకేసారి ఏర్పడే అరుదైన దృశ్యాలు కన్నియాకుమారి, దక్షిణాఫ్రికాలో మాత్రమే కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో, ఈనెల 12వ తేది కన్నియాకుమారి త్రివేణి సంగమం పశ్చిమ ప్రాంతంలోని అరేబియ సముద్రం మీదుగా సూర్యుడు అస్తమించడం, అదే సమయంలో బంగాళాఖాతంలో తూర్పున చంద్రుడు ఉదయించే దృశ్యాలు చూడవచ్చు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో కన్నియాకుమారికి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. 12న జరిగే అపురూప దృశ్యం వీక్షించేందుకు ప్రజలు భారీ ఎత్తున వచ్చే అవకాశముంది. అందుకోసం కన్నియాకుమారి త్రివేణి సంగమం సముద్ర తీరం, సన్ సెట్ సెంటర్, మురుగన్‌కుంద్రం కొండ, ప్రైవేటు లాడ్జీ పైభాగానికి ప్రజలు వెళ్లే అవకాశాలు ఉండడంతో, వారి భద్రతా దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

సీసీ ఫుటేజీ 18 నెలలు సురక్షితం

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటుచేసిన సీసీ ఫుటేజీ 18 నెలలు భద్రపరిచేలా చర్యలు చేపట్టారు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో 1,900 పోలీస్‌స్టేషన్లు ఉండగా, 99 శాతం స్టేషన్‌లలో సీసీ కెమెరాలు అమర్చామన్నారు. సీసీ ఫుటేజీ ఎక్కువ కాలం భద్రపరిచేలా చర్యలు చేపట్టామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు కేటాయించిందన్నారు. తొలివిడతగా 820 పోలీస్ స్టేషన్లలో ఉన్న సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 18 నెలలు భద్రపరిచేలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే, 251 పోలీస్ స్టేషన్లలో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

'కన్నీరు వద్దు తంబీ...!'

దివ్యాంగ విద్యార్థికి సీఎం స్టాలిన్ భరోసా

వాషర్‌మెన్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగ విద్యార్థి కోరికపై స్పందించిన ముఖ్యమంత్రి స్టాలిన్ 'కన్నీరు వద్దు తంబీ' అంటూ ఓదార్చారు. కృష్ణగిరి జిల్లా వెప్పంహళ్లి సమీపం నెడుమరుది గ్రామానికి చెందిన కీర్తివర్ష చేతులు లేకుండా జన్మించాడు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతిచెందిన నేపథ్యంలో, తల్లి కూలి పనులకు వెళ్తూ అతడిని చదివిస్తోంది. రెండేళ్ల క్రితం పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులకు 437 మార్కులు సాధించిన కీర్తివర్మ, పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. గురువారం విడుదలైన ప్లస్ టూ పరీక్షల్లో 600 మార్కులకు 471 మార్కులు సాధించాడు. గురువారం మీడియాతో మాట్లాడిన కీర్తివర్మ... నేను ఇంజనీరింగ్ చదవాలని ఆశగా ఉన్నాను. అనంతరం మంచి ఉద్యోగం చేయాలని ఉంది. కానీ, రెండు చేతులు లేకపోవడంతో ఏ పనీ చేయలేక పోతున్నాను. ఒకరి సాయం లేకుండా జీవించలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి సాయం చేయాలని కోరాడు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ విషయమై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో... 'కన్నీరు వద్దు తంబీ..! మంత్రి సుబ్రమణ్యం నీకు తగిన వైద్యం అందేలా ఏర్పాటుచేస్తారు' అంటూ పోస్ట్ చేశారు.



కీర్తివర్మను ఓదారుస్తున్న తల్లి

పీఎంకే మహానాడుకు వ్యతిరేకంగా పిటిషన్

● తోసిపుచ్చిన మద్రాసు హైకోర్టు

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): పీఎంకే మహానాడును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలో ఈ నెల 11న పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే), వన్నియర్ సంఘం సంయుక్తంగా 'చిత్తిరై పౌర్ణమి యువజనోత్సవం' పేరుతో మహాసభ నిర్వహించనున్నాయి. ఈ మహాసభ నిర్వహణపై స్టే విధించాలని కోరుతూ వడనెమిలి పంచాయతి అధ్యక్షుడు పొన్నురంగం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు.. అందులో 2013లో పీఎంకే-వన్నియర్ సంఘం సంయుక్తంగా నిర్వహించిన యువజనోత్సవాలకు వెళ్లిన వారితో విల్లుపురం జిల్లా మరక్కాణంలో కుల ఘర్షణలు జరిగాయని, ఒక వర్గం ప్రజలపై దాడిచేయడంతో పాటు వారి ఇళ్లు దహనం చేశారని, ఈ ఘటనలో నలుగురు మృతిచెందారని, అప్పటి నుంచి ఈ ఉత్సవాలకు ప్రభుత్వం అనుమతివ్వడం లేదన్నారు. ఈ క్రమంలో, ఈ ఏడాది నిర్వహించనున్న యువజనోత్సవాలతో మా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడే అవకాశముందని, కావున ఈ వేడుకలకు స్టే విధించాలని పిటిషన్‌లో కోరాడు. ఈ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తి ఎల్.విక్టోరియా గౌరి గురువారం విచారించారు. కార్యక్రమానికి ఇదివరకే అనుమతులు ఇచ్చిన కారణంగా, అనుమతులను నిరాకరిస్తూ ఉత్తర్వులివ్వలేమని పిటిషన్ తోసిపుచ్చారు.

చెన్నై కస్టమ్స్‌లో 273 మంది బదిలీ

ప్యారీస్, మే 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై కస్టమ్స్ శాఖలో ఒకే సమయంలో 273 మంది అధికారులను బదిలీ చేయడం ఆ శాఖ ఉద్యోగులను ఆందోళనకు గురిచేసింది. నగరంలోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలు, కార్గో సెంటర్లు, ఓడరేవులు, కంటేనర్ టెర్మినల్ ప్రాంతాలలో వేలాది మంది కస్టమ్స్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కస్టమ్స్ శాఖలో హఠాత్తుగా ఒకే సమయంలో బదిలీ అయిన 273 అధికారుల్లో అడిషనల్ కమిషనర్లు 41 మంది, అసిస్టెంట్ కమిషనర్లు 93 మంది, ఇన్స్‌పెక్టర్లు 139 మంది ఉన్నారు. వీరిని నగరంలోని హార్బర్ ప్రాంతంలోవున్న కస్టమ్స్ ప్రధాన కార్యాలయం, జీఎస్టీ విధింపు, చెన్నై పోర్టు, కామరాజర్ పోర్టు తదితర ప్రాంతాలకు బదిలీ చేశారు. దీనిపై కస్టమ్స్ అధికారులు మాట్లాడుతూ, ప్రతిఏటా ఏప్రిల్, మే నెలల్లో అధికారులను బదిలీ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆ విధంగానే ప్రస్తుతం బదిలీలు చేసినట్లు తెలిపారు. 2024వ సంవత్సరం పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా కస్టమ్స్ శాఖలో బదిలీలు జరగలేదని, అందువల్లే ప్రస్తుతం 273 మంది అధికారులను బదిలీ చేశారని వారు వివరించారు.

ప్లస్ టూ విద్యార్థులకు సీఎం సహా నేతల శుభాకాంక్షలు

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షా ఫలితాలు గురువారం వెలువడ్డాయి. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలు పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్ష ఫలితం ఏదైనా, అదే ముగింపు కాదని విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రహించాలి. ఉత్తీర్ణులు కానివారు, ఆశించిన మార్కులు రాని వారికి ఇంకా పలు అవకాలున్నాయి. ఇది మీ జీవితానికి ప్రారంభం మాత్రమే. మీ ఉత్తమ దశ త్వరలో వస్తుందనే సానుకూల దృక్పథంలో ముందుకెళ్లండి. పిల్లలపై ఎలాంటి ఒత్తిడి చేయకుండా, వారి తదుపరి దశ, అభివృద్ధికి మద్దతు ఇచ్చేలా తల్లిదండ్రులు మంచి స్నేహితులుగా ఉండాలి.

- ఎంకే స్టాలిన్, ముఖ్యమంత్రి

ప్లస్ టూ పరీక్షల్లో ఉత్తీర్ణులైన నా సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఒక్కటే జీవితంలో ప్రతిదీ నిర్ణయించదని అందరూ గ్రహించాలి. నిరుత్సాహపడకండి. మళ్లీ కష్టపడి పనిచేయడం ప్రారంభించండి. జీవితంలో తదుపరి దశకు వెళుతూ, మీరు ఎంచుకున్న రంగాల్లో అనేక విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుసుకుందాం. విజయం తథ్యం.

- విజయ్, టీవీకే అధ్యక్షుడు.

అభివృద్ధి సాధించేలా మీరు భాగస్వాములు కావాలి. ఉత్తీర్ణత సాధించని వారు అధైర్య పడకుండా, మళ్లీ రాసి విజయం సాధించాలి.

- ఎల్.మురుగన్, కేంద్ర సహాయ మంత్రి

ప్లస్ టూ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్య కోసం తమకు నచ్చిన, సరైన దిశను ఎంచుకోండి. ఫెయిల్ అయిన వారు అధైర్యపడవద్దు. మళ్లీ బాగా చదివి అర్థం చేసుకుని సప్లిమెంటరీ పరీక్షలు రాయండి. మీలో ప్రతి ఒక్కరూ విజేతలే. మీకు నా అడ్వాన్స్ శుభాకాంక్షలు...

- ఈపీఎస్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి.

అలాగే, పీఎంకే అధ్యక్షులు డా.రాందాస్, ఆ పార్టీ నేత డా.అన్బుమణి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ సహా పలువురు నేతలు వేర్వేరు ప్రకటనలో ప్లస్-2లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

జూన్ 25 నుంచి సప్లిమెంటరీ

ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్లస్ టూ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఫెయిలైన వారి కోసం సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 25వ తేది నుంచి నిర్వహించనున్నారు. విద్యార్థులు తాము చదివిన పాఠశాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుంది.

కోనేటిలోపడి మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.3 లక్షల ఆర్థికసాయం

తిరుత్తణి, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులోని వైద్య వీరరాఘవస్వామి ఆలయ సమీపంలోని పుష్కరిణిలోకి మంగళవారం ఉదయం స్నానాలకు దిగిన 8 మంది వేదపాఠశాల విద్యార్థుల్లో ముగ్గురు నీటమునిగి మృతిచెందారు. ఆలయంలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు జరుగుతున్న ఈ సమయంలో వేదపాఠశాల విద్యార్థులు హరిహరన్ (17), వెంకటరామన్ (19), వీరరాఘవన్ (24) మృతి ఆ ప్రాంతంలో కలకలంరేపింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విద్యార్థుల మృతికి సంతాపం తెలుపుతూ, మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ఎం.నాజర్ మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం ప్రకటించిన రూ.3 లక్షల చెక్కులను అందించారు.



మృతుల కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందిస్తున్న మంత్రి ఎస్ఎం.నాజర్

గుడియాత్తంలో ఈదురుగాలులకు అరటిచెట్లు ధ్వంసం

వేలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలోని మెడికుప్పం, తట్టవార్పై, సేంపల్లి, కొట్టారమడుగు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుండి గురువారం వేకువజాము వరకు ఉరుములు మెరుపులు, పెనుగాలులతో భారీగా వర్షాలు కురిశాయి. దీంతో పలు రహదారులలో చెట్లు కూలిపడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో గుడియాత్తంలోని సేంపేట-మెడికుప్పంలో కురిసిన వడగళ్ల వానకు చెట్లు కూలిపడ్డాయి. కాట్పాడి పరిధిలోని పెరియపుదూర్‌లో ఈదురుగాలులకు సుమారు 20వేల అరటిచెట్లు ధ్వంసమయ్యాయిని రైతులు వాపోయారు. ప్రభుత్వం దీనిపై స్పందించి పంటకు నష్టపరిహారాన్ని అందించాలని రైతులు వాపోతున్నారు. ఇదిలావుండగా వేలూరు జాతీయ రహదారిపై పెనుగాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. దీనితో ఆ రెండు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.



వినోదపు పన్ను బిల్లుకు
గవర్నర్ ఆమోదం

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు 10 శాతం వినోదపు పన్ను విధించే బిల్లుకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. ప్రవేశ రుసుముతో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలకు 10 శాతం వినోదపు పన్ను విధించేలా డిసెంబరులో జరిగిన శాసనసభ సమావేశాల్లో బిల్లు ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపారు. ఈ క్రమంలో, ఈ బిల్లును గవర్నర్ ఆమోదించినట్లు రాజ్‌భవన్ గురువారం ప్రకటన విడుదల చేసింది.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తాలు, వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం 2,829 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కిలాంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి తదితర ప్రాంతాలకు శుక్రవారం 650 బస్సులు, శనివారం 655 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు నుండి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్రవారం వంద బస్సులు, శనివారం 90 బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై తదితర నగరాల నుంచి పలు ప్రాంతాలకు 250 ప్రత్యేక బస్సులు, మాధవరం నుండి శనివారం శుక్రవారం 24 బస్సులు, శనివారం 100 బస్సులు నడుపనున్నారు. ఇవి మినహా సొంతూళ్లకు వెళ్లిన వారు చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు వచ్చేందుకు పలు ప్రాంతాల నుంచి 950 ప్రత్యేక బస్సులు మొత్తం 2,829 బస్సులు నడుపనున్నట్లు, ప్రజలు ఎస్ఈటీసీ వెబ్‌సైట్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు.

నాణ్యత లేని మందుల సరఫరా కేసులో
15 ఏళ్ల అనంతరం తీర్పు

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరులో నాసికరం మందులు సరఫరా చేసిన యజమానికి కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.20వే జరిమానా విధించింది. పెరంబలూరులోని మెడికల్ షాప్‌లో 2010 డిసెంబరు 10వ తేది సూపర్‌వైజర్లు తనిఖీలు చేశారు. అందులో, పుదుచ్చేరి రాష్ట్రం ఎంబలం తవలకుప్పంలోని ఓ సంస్థ పెరంబలూరులోని మందుల దుకాణాలు, పంపిణీదారులకు సరఫరా చేసిన మాత్రలు నాణ్యత లేనివని తెలిసింది. సూపర్‌వైజర్లు, ఆ సంస్థ యజమాని రోజ్ రాజీవ్‌సింగ్‌కు వ్యతిరేకంగా పెరంబలూరు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో రోజ్‌రాజీవ్ సింగ్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.20,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బాల్కీస్ సోమవారం తీర్పు చెప్పారు.

సనాతనం గురించి వ్యాఖ్యలు

● ఉదయనిధిపై కేసు విచారణ ఆగస్టుకు వాయిదా

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సనాతనం గురించి వ్యాఖ్యలు చేశారంటూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిపై నమోదైన కేసు విచారణ ఆగస్టుకు వాయిదాపడింది. తమిళనాడు అభ్యుదయ రచయితలు, కళాకారుల సంఘం ఆధ్వర్యంలో 2023లో నగరంలో నిర్వహించిన సనాతన నిర్మూలన మహానాడులో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సనాతనాన్ని డెంగ్యూ, మలేరియా మాదిరిగా నిర్మూలించాలి అంటూ ప్రసంగించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశం కాగా, ఆయనపై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తనకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో నమోదైన కేసులు రద్దు చేయాలని, కేసులన్నీ ఒకే కేసుగా విచారించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ ఉదయనిధి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. ఈ క్రమంలో, ఈ కేసు బుధవారం విచారణకు రాగా, తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదావేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా స్థానిక పట్టాభిరామ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. పట్టాభిరామ్, సీటీహెచ్ రోడ్డు, తిరువళ్లువర్ నగర్, కక్కంజి నగర్, సత్రం, కామరాజపురం, చోళన్ నగర్, అయ్యప్పన్ నగర్, వీజీవీ నగర్, కన్నపాళయం, ధనలక్ష్మి నగర్, వీజీఎన్ ఫేస్ 2-7, మేలపాక్కం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పల్లావరం...

రాధానగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పల్లావరం పరిధిలోని పలు ప్రాంతాల్లో కూడా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు తెలిపింది.

ఆయా ప్రాంతాల వివరాలు... కన్నన్ నగర్, రాధా నగర్, నెమిలిచ్చేరి, భారతిపురం, జమ్మన్ రాయపేట, నాయుడుకడై రోడ్డు, లక్ష్మి నగర్, జాయ్ నగర్, శాంతి నగర్, గణపతిపురం, రాధానగర్ మెయిన్ రోడ్డు, గాంధీ నగర్, సుభాష్ నగర్, నటరాజపురం, నెమిలిచ్చేరి హైరోడ్డు, పెరియార్ నగర్, కురింజి నగర్, సెంథిల్ నగర్, పోస్టల్ నగర్, నటేశన్ నగర్, సోము నగర్, ఏజీఎస్ కాలని, ఓంశక్తి నగర్, ముత్తుస్వామి నగర్, న్యూ కాలని, జీఎస్టీ రోడ్డు, సీఎల్‌సీ లైన్, హస్తినాపురం, పురుషోత్తమన్ నగర్, భజన ఆలయ వీధి, జైన్ నగర్, ఎస్బీఐ కాలని, గజలక్ష్మి నగర్, ఎస్ఎస్ఆర్ రోడ్డు.

పళ్లిపట్టులో గాలుల బీభత్సం

తిరుత్తణి, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో బుధవారం ఈదురుగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. పళ్లిపట్టు సహా పుదుపేట, కుమారరాజుపేట, ఇచ్చాంబడి, వెంకటరాజుకుప్పం తదితర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లు విరిగి రోడ్లపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే, చెట్లు విద్యుత్ స్తంభాలపై పడటంతో, పళ్లిపట్టు ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

బస్సు వెనుక పరుగెత్తిన విద్యార్థినికి 437 మార్కులు



బస్సు వెనుక పరుగులు తీస్తున్న సుహాసిని (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపం కొత్తకోట ప్రాంతానికి చెందిన సుహాసిని, ఆలంగాయంలోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ చదువుతోంది. మార్చి 5వ తేది ప్రారంభమైన పబ్లిక్ పరీక్షల కోసం సుహాసిని ప్రతిరోజు స్వగ్రామం నుంచి బస్సులో పరీక్షా కేంద్రానికి వెళుతుంది. 25న జరిగే పరీక్షకు వెళ్లేందుకు ఆమె బస్సు కోసం వేచి ఉండగా, డ్రైవర్ బస్సు ఆపలేదు. దీంతో సుహాసిని వేగంగా వెళుతున్న బస్సు వెనుకాలే పరుగులు తీసింది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ బస్సు ఆపడంతో ఆమె బస్సులో పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్ష రాసింది. ఆ సమయంలో బస్సు వెనుకగా వస్తున్న వాహనచోదకులు సుహాసిని బస్సు వెనుక పరుగులు తీస్తున్న దృశ్యాలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో, డ్రైవర్, కండక్టర్లపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ నేపథ్యంలో, గురువారం వెలువడిన ఫలితాల్లో సుహాసిని 437 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించింది.

అంబులెన్స్‌లో వచ్చి పరీక్ష రాసిన విద్యార్థికి 565 మార్కులు



అంబులెన్స్‌లో పరీక్షా కేంద్రానికి వస్తున్న సమరరితిక్ (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలి ఎముకలు విరగడంతో అంబులెన్స్‌లో వీల్ చైర్‌తో వచ్చి పరీక్ష రాసిన విద్యార్థి 600 లకు 565 మార్కులు సాధించాడు. రామనాథపురం జిల్లా మోర్‌పన్నై జాలర్ల గ్రామానికి చెందిన సమరరితిక్ పరీక్షలకు కొద్దిరోజుల ముందు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు ఎముక విరిగింది. ఆస్పత్రి చికిత్స పొందుతున్న సమరరితిక్ ఆత్మవిశ్వాసంతో తల్లిదండ్రుల సహకారంతో అంబులెన్స్‌లో వచ్చి వీల్ చైర్‌లో పరీక్షా కేంద్రానికి చేరుకుని పరీక్ష రాశాడు. గురువారం వెలువడిన ఫలితాల్లో సమర రితిక్ 565 మార్కులు సాధించాడు. ప్రస్తుతం సమరరితిక్ మెరుగైన వైద్యం కోసం రాయపేటలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఫెయిలైన విద్యార్థి ఆత్మహత్య

ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విల్లుపురం జిల్లాలో చోటుచేసుకుంది. సిరువాలై గ్రామానికి చెందిన గోకుల్‌నాథ్ ప్లస్ టూ పరీక్షలు రాశాడు. గురువారం వెలువడిన ఫలితాల్లో అతను ఫెయిలయ్యాడు. తీవ్ర మనస్తాపం చెందిన గోకుల్‌నాధన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మృతిచెందిన విద్యార్థికి 443 మార్కులు



సుకుమార్ (ఫైల్ ఫొటో)

వాషర్‌మెన్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థి, ప్లస్ టూ పరీక్షల్లో 443 మార్కులతో ఉత్తీర్ణులయ్యాడు. దిండుగల్ జిల్లా ఓత్తయూర్ గ్రామానికి చెందిన బాలమురుగన్ కుమారుడు సుకుమార్ (18) దిండుగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ ప్లస్ టూ పరీక్షలు రాశాడు. గత నెల 6వ తేది సుకుమార్ వస్తున్న ద్విచక్రవాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ 21వ తేది మృతిచెందాడు. గురువారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో 443 మార్కులు సాధించాడు. చిన్న వయసు నుంచే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే కోరికతో సుకుమార్ కష్టపడి చదివేవాడని తల్లిదండ్రులు వాపోయారు.

ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థినికి 413 మార్కులు

ప్లస్ టూ పరీక్షల్లో ఫెయిలవుతాననే భయంతో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని, 413 మార్కులతో ఉత్తీర్ణురాలు కావడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. తంజావూరు జిల్లా పాపనాశం సమీపంలోని గ్రామానికి చెందిన పుణ్యమూర్తి కుమార్తె ఆర్తిక, పాపనాశం ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇటీవల ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసింది. గురువారం పరీక్షా ఫలితాలు విడుదల కానుండగా, పరీక్షల్లో ఫెయిలవుతాననే భయంతో బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం వచ్చిన ఫలితాల్లో ఆమె 413 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. గురువారం ఆర్తిక అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు, స్నేహితులు ఈ విషయం తెలుసుకుని మరింత కృంగిపోయారు.

108 అంబులెన్స్ సంస్థకు బాంబు బెదిరింపు

ప్యారీస్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలో ఉన్న 108 అంబులెన్స్ సంస్థకు బాంబు పేలుతుందని ఓ మందుబాబు బెదిరించిన సంఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. తేనాంపేటలో డీఎంఎస్ ప్రాంగణంలో 108 అంబులెన్స్ సంస్థ కూడా పనిచేస్తోంది. బుధవారం సాయంత్రం ఈ సంస్థకు ఫోన్ చేసిన వ్యక్తి బాంబు ఉందని చెప్పి, కనెక్షన్ కట్‌చేశాడు. దీంతో ఆ సంస్థ అధికారుల ఫిర్యాదు మేరకు తేనాంపేట పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఆ కార్యాలయం చేరుకుని తనిఖీలు చేసి, అది వదంతిగా నిర్ధారించారు. ఆ తర్వాత ఫోన్ ద్వారా బెదిరించిన వ్యక్తి కోసం విచారించగా అతను రెడ్‌హిల్స్‌కు చెందిన సెల్వం అని తెలిసింది. మద్యం మత్తులో అతను ఫోన్ చేసినట్లు అదుపులోకి తీసుకున్న పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయం కేసులో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ ఐస్‌హౌస్ ప్రాంతంలో గంజాయి విక్రయించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐస్‌హౌస్ ప్రాంతంలో మాదకద్రవ్యాల వ్యాపారం గుట్టుగా సాగుతోందని ఎక్సైజ్ పోలీసులకు అందిన సమాచారంతో బుధవారం ఆ ప్రాంతంలో నిఘా వేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నింగా, అతడు పొంతనలేకుండా సమాధానం తెలిపాడు. దీంతో అతని దుస్తులను తనిఖీ చేసి, 4 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో తిరువాన్మియూర్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని దగ్గర 2గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గగనతలంపై ఆంక్షలు..
చెన్నైలో 10 విమాన సేవల రద్దు

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత ప్రభుత్వం ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు జరుపుతున్న నేపథ్యంలో గగనతలంపై కేంద్రం ఆంక్షలు విధించడంతో చెన్నై విమానాశ్రయంలో గురువారం ఉదయం 10 విమాన సేవలను రద్దు చేశారు. గురువారం వేకువజాము కాసియాబాద్ సమీపం హిండన్ నగరానికి వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం, ముంబయి వెళ్లే రెండు ఎయిర్ ఇండియా విమానాలు, చండీఘర్ వెళ్ళాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం, కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ వెళ్లే స్పేస్‌జెట్ విమానం సహా ఐదు విమానసేవలు రద్దు చేశారు. ఇదే విధంగా ముంబయి, చండీఘర్, శివమొగ్గ, హిండన్ నగరం నుంచి చెన్నై నగరానికి రావాల్సిన ఐదు విమాన సేవలు కూడా రద్దయ్యాయి.



ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు


'అంబి'లో రోబో శంకర్, అశ్విని

రోబో శంకర్ 'అంబి' విడుదల

ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్ హీరోగా పరిచయమవుతూ రూపొందిన చిత్రం 'అంబి'. నేడు విడుదలకానుంది. టీ2 మీడియా అనే పతాకంపై ఎఫ్. ప్రశాంతిఫ్రాన్సిస్ నిర్మించారు. వీధి కళాకారుడిగా మంచి పేరుతో పాటు గుర్తింపును పొందిన రోబో శంకర్ ఈ చిత్రం ద్వారా కథనాయకుడుగా ప్రేక్షకుల ముందుకువస్తున్నారు. ఆయన సరసన అశ్విని హీరోయిన్‌గా నటించారు. ఇతర పాత్రల్లో రమేష్ ఖన్నా, గంజా కరుప్పు, ఇమాన్ అన్నాచ్చి, మోహన్ వైద్య, కోవై బాబు, నారాయణ, మీసై రాజేంద్రన్, చరణ్‌రాజ్, షర్మిల, విద్య తదితరులు నటించారు. కన్నడంలో 'అఘోర', 'మగలే', వంటి అనేక చిత్రాలకు సంగీతం సమకూర్చిన ఏబీ మురళిధరన్ సంగీతం అందించారు. ఈ సినిమా దర్శకుడు ఫాసర్ జె.ఎల్విన్ మాట్లాడుతూ, 'ఇది పూర్తిగా కుటుంబ కథా చిత్రం. ఈ సినిమాలో హీరో నిజంగానే అంబి, అంబావిగా, పిరికిపందగా ఉండగా, ఆయన చుట్టున్న వారు మాత్రం నీవు చాలా ధైర్యవంతుడువి, మంచి అదృష్టవంతుడువి అంటూ నమ్మిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్న హీరో ఆ పరిస్థితులను ఎలా అధిగమించారు అన్నదే ఈ చిత్ర కథ. ఆరంభంలో అంబిగా ఉన్న హీరో చివరకు అన్నియన్ (అపరిచితుడు)గా ఎలా మారాడు అన్నదే కుటుంబ సభ్యులతో కలిసి చూసే చిత్రంగా ఉంటుంది. సమ్మర్ స్పెషల్‌గా నేడు విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

'మామన్' ఓ మంచి కుటుంబ కథా చిత్రం


ఆడియో రిలీజ్ దృశ్యం

● దర్శకుడు పాండిరాజ్

చిత్రజ్యోతి

సూరి - ఐశ్వర్య లక్ష్మి జంటగా తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన 'మామన్' ఓ మంచి కథా చిత్రంగా నిలుస్తుందని ఆ చిత్ర దర్శకుడు పాండిరాజ్ అన్నారు. లార్క్ స్టూడియో పతాకంపై కె.కుమార్ నిర్మించిన ఈ చిత్రం 16వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఆడియో రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు పాండిరాజ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా చివరి రోజు షూటింగ్‌లో హీరో కార్తి కనిపించి, ఇందులో నటించిన కొత్త నటీనటులను చూస్తూ ఖచ్చితంగా మూవీ హిట్ అవుతుందన్నారు. ఇపుడు ఆడియో రిలీజ్ వేడుకకు సీనియర్ నటుడు రాజ్‌కిరణ్, విజీ చంద్రశేఖర్, శ్వాసిక, ఐశ్వర్య లక్ష్మిలను చూడగానే ఖచ్చితంగా సినిమా హిట్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నాను. హీరో సూరి మాట్లాడుతూ, 'సినిమాలోని చివరి 20 నిమిషాల సన్నివేశాలను చూసి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన నిర్మాత చిదంబరంకు ధన్యవాదాలు. ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించిన రాజ్‌కిరణ్‌కు పాదాభివందనం. సంగీత దర్శకుడు హోషీం అబ్బుదల్ వహాబ్‌ను కోలీవుడ్‌కు తమిళ చిత్రపరిశ్రమ తరపున ఆహ్వానిస్తున్నాం. అనంతరం చిత్ర బృందం సభ్యులు, అతిథులు, నిర్మాతలు ప్రసంగించారు.


చెక్కు అందజేస్తున్న హీరో సూర్య

'అగరం' ఫౌండేషన్‌కు రూ.10 కోట్ల విరాళం

తాను నటించిన తాజా చిత్రం 'రెట్రో' మూవీ విజయంతో వచ్చిన లాభాల్లో రూ.10 కోట్లను అగరం ఫౌండేషన్‌కు హీరో సూర్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మన దగ్గర ఉన్న విషయాలు, సంపదను నలుగురికి పంచడంలో ఉండే సంతృప్తి, ఆనందం ఎందులోనూ ఉండదు. 'రెట్రో' సక్సెస్‌ను మీతో కలిసి జరుపుకోవడం ఆనందంగాఉంది. నా కెరీర్‌లో క్లిష్టపరిస్థితులు ఎదురైనపుడు అభిమానుల ప్రేమ, మద్దతు ఇస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. పేద విద్యార్థులకు విద్యాదానం చేసేందుకు వీలుగా అగరం ఫౌండేషన్ నెలకొల్పాం. తద్వారా అనేక మంది పేదవారికి సాయం చేయాలంటే ఇతరుల అండదండలు ఎంతో ముఖ్య. ఇందులో నా వంతుగా రూ.10 కోట్లను అగరం ఫౌండేషన్‌కు విరాళంగా అందజేస్తున్నాను' అని పేర్కొన్నారు.



నటనకు బలం చేకూర్చే కథా చిత్రాల్లో నటించాలి

● ప్రియా ప్రకాష్

నటనకు బలం చేకూర్చే కథా చిత్రాల్లో నటించాలని ఉందని హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్ అన్నారు. మలయాళ చిత్రం ద్వారా తొలిసారి పరిచయమైన ప్రియా ప్రకాష్‌కు వరుస సినిమా అవకాశాలు వస్తున్నాయి. కానీ, ఆమెకు మాత్రం అదృష్టం మాత్రం వరించలేదు. తాజాగా అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీలో నటించి మళ్ళీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. ఇదే అంశంపై ఆయన మాట్లాడుతూ, 'అజిత్, అర్జున్ దాస్ చిత్రాల్లో నటించం నాకు డబల్ ధమాకా వంటింది. భవిష్యత్‌లో కూడా ఇలాంటి బలమైన కథా పాత్రల్లో నటించాలని ఉంది. మున్ముందు కూడా ఇలాంటి గొప్ప ప్రతిభావంతులైన నటులతో కలిసి నటించాలని ఉంది. అజిత్‌తో నటించడంతో ఆ కల నెరవేరింది. ఈ సినిమాలో సిమ్రన్ పాటను రీక్రియేట్ చేశారు. ఈ పాటలో సిమ్రన్ కంటే నా నృత్యానికి ప్రేక్షకులు మంచి మార్కులు వేశారు. వారికి ధన్యవాదాలు' అన్నారు.

నయన మనోహరం

మీనాక్షి, సుందరేశ్వరుల కల్యాణం

కల్యాణవేదికపై మాంగల్యాన్ని ప్రదర్శిస్తున్న యువ భట్టార్లు సత్యన్, గౌతమ్



● పరవశించిన భక్తజనం
● కిక్కిరిసిన మదురై నగరం

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో మీనాక్షి, సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం గురువారం ఉదయం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఈ ఆలయంలో మీనాక్షి అమ్మవారికి ప్రతియేటా ఉత్సవాలు జరుగుతుంటాయి. వాటిలో చిత్తిరై ఉత్సవాలు అత్యంత ప్రసిద్ధి గాంచాయి. ఏప్రిల్ 29న చిత్తిరై ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన మీనాక్షి అమ్మవారి పట్టాభిషేక మహోత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. బుధవారం ఉదయం మదురై సామ్రాజ్ఞి మీనాక్షిదేవి దేవతలను జయించి, చివరగా సుందరేశ్వరస్వామితో పోరుసల్పి దిగ్విజయ వేడుకల కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మీనాక్షి, సుందరేశ్వరుల తిరుకల్యాణం వైభవంగా ప్రారంభమైంది. వేకువజాము నాలుగు గంటలకు మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరులు వెండి సింహాసనంపై కొలువుదీరి వీధుల్లో విహరించారు. ఈ కల్యాణోత్సవం కోసం ఆలయ అంతర ప్రాకారం ఉత్తర ఆడి వీధి, పడమటి ఆడి వీధి కూడలి వద్ద రూ.35లక్షలతో ఊటీ, బెంగళూరు నగరాల నుంచి, విదేశాల నుంచి తెప్పించిన 10 టన్నుల పుష్పాలు. వెట్టివేర్లతో కల్యాణవేదికను అలంకరించారు. ఆది దంపతుల తిరుకల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తిరుప్పరంకుండ్రం దివ్య క్షేత్రం నుండి దేవసేనా సమేత మురుగన్, పవలకనివాయ్ పెరుమాళ్ వేంచేశారు. ఉదయం 7.45 గంటలకు సర్వాలంకరణశోభితులైన మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరస్వామి నూతన వధూవరులుగా కల్యాణవేదికపై కొలువుదీరారు. పవలకనివాయ్ పెరుమాళ్ అమ్మవారివైపు, సుబ్రహ్మణ్యస్వామి, దేవసేన సుందరేశ్వరుల వారి ఎడమవైప వేంచేశారు. మీనాక్షి అమ్మవారు పట్టువస్త్రాలు ధరించి, ముత్యాలహారం, స్వర్ణకిరీటం, పగడపు ముక్కుపుడక, స్వర్ణకాసుల దండ, ఆకుపచ్చరాతి పతకం ఇలా విలువైన ఆభరణాలను ధరించారు. ఇదే విధంగా వజ్రాభరణాలు, పట్టు వస్త్రాలు ధరించి సుందరేశ్వరస్వామి కూడా కొలువుదీరారు. విఘ్నేశ్వరపూజతో తిరుకళ్యాణ వైభవం ప్రారంభమైంది. పెళ్లిపీటల ఎదుట యాగగుండం వెలిగించిన శైవాగమపండితులు అగ్ని దేవతను ఆవాహనం చేసి, సుగంధ ద్రవ్యాలను ఆహుతి చేసి, వేదమంత్రాలు పఠించారు. అనంతరం కల్యాణానికి సంబంధించిన ప్రారంభ క్రతువులు నిర్వహించి, మీనాక్షి, సుందరేశ్వరులకు ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. పవలకనివాయ్ పెరుమాళ్ తన సోదరి మీనాక్షి అమ్మవారిని సుందరేశ్వరర్‌స్వామివారికి కన్యాదానం చేసే మహోన్నత ఘట్టం అత్యంత భక్తి శ్రద్ధల మధ్య జరిపించారు. ఇక ఉదయం 8.35 గంటల నుంచి శుభ ముహూర్త వేళ శివాచార్యుల వేదపఠనం, ఆలయ ప్రధానార్చకులు మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ తిరుకల్యాణం నిర్వహించారు. మీనాక్షి అమ్మవారిలా శివశేఖరన్ భట్టర్ కుమారుడు సత్యన్, సుందరేశ్వరుడు ప్రకాష్ భట్టర్ కుమారుడు గౌతమ్ నటించి మొదట పూల దండలు మార్చుకున్నారు. అనంతరం సుందరేశ్వరుడి వేషధారణలో ఉన్న గౌతమ్ మీనాక్షి అమ్మవారికి తిరుమాంగళ్యాన్ని అలంకరింపజేశారు. ఆ తర్వాత భక్తులు నవదంపతులైన మీనాక్షి సుందరేశ్వరులను దర్శించుకున్నారు. ఈ వేడుకలకు హాజరైన వివాహితులు సుందరేశ్వరర్ స్వామివారు మాంగళ్యధారణ చేస్తున్న సమయంలో కొత్త పసుపుతాళ్ళను మెడలో కట్టుకున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తిరుకళ్యాణం పూర్తికాగానే నవదంపతులులైన మీనాక్షి సుందరేశ్వరులు పాత కల్యాణ మండపంలో వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు.


సుందరేశ్వరస్వామి తరపు బంధువుగా దేవసేన


తిరుప్పరం కుండ్రం సుబ్రహ్మణ్య స్వామి, దేవసేన


పెళ్ళిపెద్దగా పవలకనివాయన్


కల్యాణవేదికపై తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యస్వామి, దేవసే, పవలకనివాయన్ (మహావిష్ణువు)

■ అలరించిన చిన్నారుల వేషధారణ...

ఈ తిరుకల్యాణోత్సవంలో చిన్నారులు వివిధ దేవతామూర్తుల వేష ధారణతో సందడి చేశారు. మీనాక్షి అమ్మవారు, గోదాదేవి, కంచి కామక్షి, వేలాయుధం ధరించిన వేల్‌మురుగన్‌లా వేషధారణలతో తిరుకల్యాణమండప ప్రాంతంలో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ వేడుకలకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక దర్శనం టికెట్లు కూడా విక్రయించారు. మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన 20కిపైగా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేసిన కల్యాణోత్సవ వేడుకలను భక్తులు తిలకించారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

లక్షమందికి ప్రసాదాలు..

మీనాక్షి అమ్మవారి తిరుకల్యాణోత్సవం సందర్భంగా సుమారు లక్షల మంది భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. మదురై సేతుపతి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ వేదికలో వరుడు సుందరేశ్వరస్వామి తరపున భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ విందులో పాల్గొన్న భక్తులంతా తమకు తోచినంత చదివింపులు కూడా చేశారు. ఇక మదురై నగరమంతటా స్థానిక భక్త సంఘాల ఆధ్వర్యంలో పానకాలు, మజ్జిగ పంపిణీ చేసారు.


వేదపారాయణం చేస్తున్న పండితులు

మియాట్‌లో అరుదైన ఆపరేషన్

● యాంటీ-కిడ్ జేకే (బి) యాంటీ బాడీ పాజిటివ్ రోగికి విజయవంతంగా కాలేయ మార్పిడి

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన 'మియాట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే తొలిసారిగా అరుదైన బ్లడ్ గ్రూప్ 'యాంటీ-కిడ్ జేకే (బి) యాంటీ బాడీ పాజిటివ్' వున్న రోగికి విజయవంతంగా కాలేయ మార్పిడి పూర్తి చేశారు. ఈ వివరాలను ఆస్పత్రి లివర్ ట్రాన్స్‌ప్లంట్-అనస్థీషియా అండ్ క్రిటికల్ కేర్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కార్తీక్ రాజ్, ఆస్పత్రి చైర్మన్ మల్లికా మోహన్‌దాస్, సీనియర్ సర్జన్ డాక్టర్ కార్తీక్ మదివానన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ డాక్టర్ ఎం.జోషువా డేనియల్ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. మాల్దీవులకు చెందిన అమీనత్ నఫియా ప్లీహం, మధుమేహం, థైరాయిడ్, కొలస్ట్రాల్, హృద్రోగంతో బాధపడే వారు. దీనికి తోడు ఆమెకు లివర్ సిర్రోసిస్ వున్నట్లు అక్కడి వైద్యులు గుర్తించారు. అత్యవసరంగా కాలేయమార్పిడి అవసరమైంది. ఆమె దీర్ఘకాలిక కాలేయ వ్యాధి కారణంగా అన్నవాహికలోని సిరలు విస్తరించి, ఎగువ జీర్ణశయాంతర రక్తస్రావం ఉదంతాలు సంభవించాయి. దీనికి తోడు ఆమె స్వల్పంగా జ్ఞాపకశక్తిని కూడా కోల్పోయింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆరు నెలల కంటే ఎక్కువ కాలం జీవించలేదని తేల్చారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబీకులు ఇటీవల మాల్దీవుల్లోని మియాట్ వైద్య శిబిరాన్ని సందర్శించి, అక్కడ పరీక్ష చేయించారు. మియాట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ నిపుణుడు ఆమె కేసును సమీక్షించి, మందులు మార్చారు. ఆమె కుమారుడు బ్లడ్ గ్రూప్ ఒ-పాజిటివ్ కావడంతో,తన కాలేయంలోని భాగాన్ని దానం చేయడానికి సిద్ధంగా ఉండడంతో ఆమెను కాలేయమార్పిడి కోసం మియాట్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ఆమెను పరీక్షించగా, రోగికి యాంటీ-కిడ్ జేకే (బి) యాంటీ బాడీ పాజిటివిటీ వున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇది ఆసియా జనాభాలో అరుదైన బ్లడ్‌గ్రూప్. కిడ్ యాంటిజెన్ ఆర్‌బీసీలు, మూత్రపిండాల పొరపై మాత్రమే వ్యక్తీకరించబడతాయి. దాని తక్కువ టైటర్ , తాత్కాలిక స్వభావం కారణంగా సాధారణ స్క్రీనింగ్‌లో యాంటీ-కిడ్ జేకే (బి) యాంటీ బాడీ పాజిటివిటీని గుర్తించడం చాలా కష్టం. అది రోగి ప్రాణానికి హాని చేసే అవకాశం కూడా వుంది. ఈ సంక్లిష్ట కేసులో రక్తమార్పిడి నిపుణులు కీలక పాత్ర పోషించగా, కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకోగా, తన స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమైంది. ఈ సమావేశంలో ఆమె ఆసుపత్రి వైద్యులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపింది.


వైద్యులకు కృతజ్ఞత తెలుపుతున్న అమీనత్ నఫియా


తిరుప్పూరు జిల్లా అవినాశిలింగేశ్వరాలయ మహారథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎండీఆర్ఎఫ్ పరిశోధనల్లో కొత్త రకం మధుమేహం

చెన్నై, మే 8 (ఆంధ్రజ్యోతి) : కొత్త రకం మధుమేహాన్ని కనుగొన్నట్లు ఎండీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ వి. మోహన్ ప్రకటించారు. నగరానికి చెందిన మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్), అమెరికాలోని సెయింట్ లూయిస్, మిస్సోరీలోని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో మెచ్యూరిటీ-ఆన్‌సెట్ డయాబెటీస్ ఆఫ్ ది యంగ్ (మోడీ) అనే కొత్తరకం మధుమేహం గుర్తించినట్టు వెల్లడించారు. గురువారం గోపాలపురంలోని డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ పేరుతో ఇప్పటికే 14 రకాల మధుమేహాలున్నాయని, ప్రస్తుతం జన్యుపరంగా వచ్చే ఈ కొత్త రకం మధుమేహం మోడీ 15గా పిలువబడుతోందన్నారు. సెమ్మంజేరిలోని తమ పరిశోధనా సంస్థలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రక్త నమూనాలను పరీక్షించినప్పుడు ఈ విషయం బయటపడిందన్నారు. ఈ రకం మధుమేహానికి ఇన్సులిన్ వేయాల్సిన అవసరం ఉండదని, ప్రస్తుతం వాడుతున్న పలు రకాల మందుల్లో ఏ రకం మందు ఈ కొత్త మోడీ-15 రకం మధుమేహాన్ని నియంత్రించగలదో గుర్తించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. మీడియా సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ రాధా వెంకటేశన్ కూడా పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వి.మోహన్, డాక్టర్ రాధా వెంకటేశన్



పద్మావతి అమ్మవారి సేవలో హైకోర్టు సీజే



తిరుచానూరు, మే 8(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం సన్నిధిలోని మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించారు.

చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్


తిరుచ్చి పుత్తూరు పెరియార్‌రోడ్డులో ప్రతిష్ఠించిన నడిగర్ తిలకం శివాజీగణేశన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, శివాజీ కుమారులు ప్రభు, రామ్‌కుమార్, మంత్రి నెహ్రూ తదితరులు